హాట్ సమ్మర్.. కూల్ బిజినెస్

కూల్‌డ్రింక్స్



- శీతల పానీయాలకు భలే గిరాకీ
- ఐస్‌క్రీంలు, పండ్ల రసాలు కూడా..

భైంసాటౌన్: ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచే సూరీడు సుర్రుమంటున్నాడు. ఇక మధ్యాహ్నం వేళల్లో చెప్పనక్కర్లేదు. దీంతో జనాలు బయటకు రావాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండవేడి నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు, పండ్ల రసాలు తీసుకుంటున్నారు. దీంతో హాట్ సమ్మర్‌లో కూల్ బిజినెస్ అయిన జ్యూస్ సెంటర్లకు భలే గిరాకీ ఏర్పడింది. రద్దీ ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలో ఇవి ఎక్కువగా వెలుస్తున్నాయి. అంతేగాక మొబైల్ వాహనాలపై సైతం జ్యూస్ సెంటర్లు దర్శనమిస్తున్నాయి. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో చల్లచల్లని జ్యూస్‌లు, ఫాలూదా షేక్‌లు, పండ్ల రసాలు, ఐస్‌క్రీంలను తీసుకుంటూ జనాలు వేడి బారి నుంచి ఉపశమనం పొందుతున్నారు. మార్కెట్‌లో పండ్ల రసాలు రూ.10 నుంచి రూ.50 వరకు లభిస్తున్నాయి. అలాగే ఫాలూదా షేక్‌లు, రబ్డి ఫాలూదా, డ్రై ఫ్రూట్ ఫాలూదా, బాదాం షేక్, కాజు షేక్ వంటివి రూ.30 నుంచి రూ.వంద వరకు లభిస్తున్నాయి.

వేడి నుంచి ఉపశమనం కోసం..

నేను భైంసాలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాను. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనిలో బిజీగా ఉంటాను. ఎండ వేడికి తాళలేక ఉపశమనం కోసం ఇలా చల్లచల్లటి జ్యూస్ కోసం వస్తుంటాను. మనసుకు ప్రశాంతంగా అనిపిస్తుంది. – నరేశ్, భైంసా

గిరాకీ బాగుంది

ఏటా వేసవిలో జ్యూస్ సెంటర్ నిర్వహిస్తుంటాను. మూడునెలల పాటు గిరాకీ బాగుంటుంది. పండ్ల రసాలు, లస్సీతోపాటు ఐస్‌క్రీంలు, ఇతర కూల్‌డ్రింక్స్‌కు గిరాకీ ఉంటుంది.
– మహేశ్, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు, భైంసా



డ్రైఫ్రూట్ ఫాలూదా షేక్

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి స్పందన

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని 'ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి' శీర్షికన ఈనెల 7న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ ఏఈ శివకుమార్, లైన్‌మెన్ శ్రీకాంత్‌లు శనివారం ఎత్తైన ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.



లోకేశ్వరంలో ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

పెంబి పీహెచ్‌సీ తనిఖీ

పెంబి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఖానాపూర్ జూనియర్ సివిల్ జడ్జి జితిన్ కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య పరికరాలు, రికార్డులు పరిశీలించారు. పలువురు సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూడీసీ అధికారి రామకృష్ణకు బదులు మరొకరు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నట్లు గుర్తించి మండిపడ్డారు. వైద్య సిబ్బందికి సమయపాలన లేదని, వారానికి రెండు రోజులు కూడా వైద్యుడు అందుబాటులో ఉండటం లేదని రోగులు జడ్జికి విన్నవించారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు చేపడుతామన్నారు.



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జితిన్‌కుమార్

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

కడెం: మండలంలోని నర్సాపూర్ కాలనీ సర్పంచ్ కుడిమేత బాదురావు ఇంట్లో శనివారం తెల్లవారుజాము షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఇంటిని పరిశీలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.



దగ్ధమైన సామగ్రి

అంబేద్కర్ విగ్రహంపై రాజకీయం తగదు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీలను మరిచి అంబేద్కర్ విగ్రహంపై రాజకీయం చేయడం తగదని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ అన్నారు. జాతీయ ఎస్సీ మోర్చా ఆదేశాల మేరకు అంబేద్కర్ జయంతి వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్‌లో ఎస్సీ కాలేజ్ వసతిగృహం దళిత మోర్చా ఆధ్వర్యంలో శనివారం సందర్శించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకండి రమాదేవి మాట్లాడారు. ఎస్సీ వసతి గృహాల్లో సరైన సదుపాయాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక ఆవరణలో పాములు, పందుల బెడద ఉందని మురుగునీరు యథేచ్ఛగా పారడం, దోమల బెడద, హౌస్ కీపింగ్ సరిగా లేకపోవడం లాంటి సమస్యలతో విద్యార్థులు సతమవుతం అవుతున్నారని అన్నారు. దీనిపై సంబంధిత అధికారి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసిమ్మె రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఒడిసెల శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ నయన్, గంగాభూషణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

'ఏలేటి' వెళ్లినా కాంగ్రెస్‌కు నష్టం లేదు

ఖానాపూర్: ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో వెళ్లడంతో కాంగ్రెస్‌కు ఎలాంటి నష్టం లేదని పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 15 ఏళ్లుగా మహేశ్వర్‌రెడ్డికి సెక్యులర్ లీడర్ అనే పేరు ఉండేదని, మతతత్వ బీజేపీలో చేరి ఆ పేరు చెడగొట్టుకున్నారని అన్నారు. మహేశ్వర్‌రెడ్డి వెళ్లడం ద్వారా నిర్మల్ నియోజకవర్గంలోనే కాక జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని అన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు యూసుఫ్ ఖాన్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, పార్టీ నాయకులు మడిగెల గంగాధర్, జహీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్య

ముధోల్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ముధోల్‌తోపాటు కొన్ని గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తడంతో 6 గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. జిల్లా కేంద్రం నుంచి ఎంఆర్‌డీ మరమ్మతు సభ్యులు సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేసినా ఫలితం లేకపోయింది. శనివారం మరమ్మతు చేపట్టారు. భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ లక్ష్మణ్, ఎంఆర్‌డీ డీఈ రమేశ్, ఏఈ మల్లేశ్, ముధోల్ ఏఈ శ్రీకాంత్ పర్యవేక్షించారు. సబ్ ఇంజినీర్లు, సిబ్బంది ఉన్నారు.



మరమ్మతు చేపడుతున్న సిబ్బంది

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన

కుభీర్: మండల కేంద్రంలోని బట్టిగల్లీలో నీటి సమస్య పరిష్కరించాలని మహిళలు నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులుగా బోరు మోటార్లు పనిచేయడం లేదన్నారు. కుళాయిల ద్వారా భగీరథ నీరు రావడం లేదన్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులను నిలదీశారు. వెంటనే ఈవో విజయ్ కాలనీకి వెళ్లి బోరుబావులను పరిశీలించి ఆదివారం నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



నిరసన తెలుపుతున్న మహిళలు



పల్లెదారికి పచ్చని తోరణం

లోకేశ్వరం: వేసవిలో ఎక్కడ చూసిన ఎండిపోయిన చెట్లు ఆకులు రాలి మోడు వారిన వృక్షాలు కనిపిస్తాయి. కాని లోకేశ్వరం నుంచి రాయపూర్‌కాండ్లీ గ్రామానికి వెళ్లేదారిలో రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చని తోరణాన్ని తలపిస్తున్నాయి. ఎండవేడిమి నుంచి రక్షణకు నడుచుకుంటూ వెళ్లేవారు, ద్విచక్రవాహనదారులు సేదతీరుతున్నారు.

సమ్మె నోటీసు అందజేత

భైంసారూరల్: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు ఎంపీవో మొజమ్‌హుస్సేన్‌కు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నాలుగేళ్ల గడువు పూర్తయినా జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్‌పై ఎలాంటి ఉత్తర్వులు రాలేవన్నారు. టీపీఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మె నోటీసును ఎంపీవోకు అందించినట్లు తెలిపారు.

దస్తురాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీవోకు అనిల్‌కు సమ్మె నోటీసు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, దేవేందర్ రెడ్డి, రాజేశ్వరి, మౌనిక, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవోకు వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈనెల 28 లోగా కార్యదర్శుల రెగ్యులరైజేషన్ గురించి ప్రభుత్వం స్పందించకపోతే విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటామని కార్యదర్శుల ఫోరం మండల అధ్యక్షుడు గిరిధర్ అన్నారు. కార్యదర్శులు నరేశ్, భూమేశ్, మనోజ్, ఫిరోజ్, తదితరులు ఉన్నారు.

కుభీర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె నోటీస్‌ను శనివారం సూపరింటెండెంట్ నవనీత్‌కు అందజేశారు. విజయ్, కిరణ్ తదితరులు ఉన్నారు.



ఎంపీవో మొజమ్‌హుస్సేన్‌కు సమ్మె నోటీసును అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పేదల ఆర్థికాభివృద్ధే మోదీ లక్ష్యం

లక్ష్మణచాంద: దేశంలోని పేద ప్రజల ఆర్థికాభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. పల్లెపల్లెకూ బీజేపీ–ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను వివరించారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, శ్మశానవాటికలకు కేంద్రం నిధులు ఇస్తే అవి తమవవని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుందన్నారు. మండల ఉపాధ్యక్షుడు రంజిత్, ఓబీసీ మండల ఉపాధ్యక్షుడు నాగుల రాజు, నాయకులు నితిష్, రాకేశ్, సందీప్, అశోక్, గంగారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర పథకాలను వివరిస్తున్న గోవర్ధన్

రంజాన్ కానుకల పంపిణీ

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో మసీదు ఆవరణలో మైనార్టీ సోదరులకు బీఆర్‌ఎస్ నాయకులు శనివారం రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. పార్టీ మండల కన్వీనర్ పాపెన్ రాజేశ్వర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కుమ్మరి భాస్కర్, నాయకులు కుమ్మరి రమేశ్, రాజేశ్వర్, లింగాల శ్రీను, లస్మన్న, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ముస్లిం కుటుంబాలకు సర్పంచ్ కనీస్‌ఫాతిమా రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు హైమ్మద్ పాష్, నాయకులు యూనుస్, తదితరులు పాల్గొన్నారు.



గొల్లమాడలో కానుక అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

లోకేశ్వరం: ఐక్యంగా ఉంటేనే సంఘాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తాలూకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రోల్ల రమేశ్ అన్నారు. మండలంలోని పోట్‌పల్లి గ్రామంలో శనివారం మున్నూరు కాపు మండల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. సంఘం భవనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. సంఘాలు సంఘటితంగా ఉండి ముందుకు సాగాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు మంద లింగన్న, సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు భోజన్న, మండల ఉపాధ్యక్షుడు దేవన్న ,నాయకులు రాజేశ్వర్, భోజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్

గాలివాన నష్టంపై అధికారుల సర్వే

సారంగపూర్: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు ఊరగుట్టపై జనజీవనం అతలాకుతలమైంది. బలమైన గాలులు వీయడం, గాలివానతో ఆరు ఇళ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎంఆర్‌ఐ ముంతాజ్ శనివారం ఊరగుట్టపై జరిగిన నష్టం అంచనా వేసేందుకు సర్వే చేపట్టారు. ఇళ్లపైకప్పులు, రేకులు కొట్టుకుపోవడంతోపాటు పెద్దమొత్తంలో నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

18న కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18న కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం ఉంటుందని పార్టీ ప్రధాన కార్యదర్శి వెద్మ బొజ్జు తెలిపారు. శనివారం ఖానాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి రాంచంద్రారెడ్డితోపాటు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది బస్టాండ్ ఆవరణలో విన్యాసాలు ప్రదర్శించారు. అలాగే అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై పోస్టర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి చరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

19న పార్‌పెల్లిలో సమావేశం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ఉప సర్పంచ్ విద్యాసాగర్‌రెడ్డి తొలగించిన నేపథ్యంలో పంచాయతీలో ఈ నెల 19న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీవో నసీరుద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాయింట్ సంతకం కోసం వార్డు సభ్యుల నుంచి ఒకరిని ఎన్నుకోనున్నట్లు వివరించారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల: కుంటాల ఎస్సై హన్మాండ్లు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. వాటర్ ప్లాంట్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సభ్యులు జక్కుల రమేశ్, ఒడ్నం రమేశ్, దోనిగామ రాజు, రజనీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పేపర్ లీకేజితో అన్యాయం'

ఖానాపూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజి వ్యవహారంతో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాణావత్ సిద్ధార్థనాయక్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకేజి వ్యవహారంపై ప్రభుత్వ స్పందన కరువైందన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆమరణ నిరాహారదీక్షలు చేపడుతామన్నారు. పేపర్ లీకేజితో నష్టపోయిన నిరుద్యోగులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కుంటాల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హన్మాండ్లు సూచించారు. మండలంలోని అందకూర్‌లో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచితులు ఫోన్‌చేసి వ్యక్తిగత, బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ నంబర్ అడిగితే చెప్పవద్దన్నారు. సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, ఏఎస్సై రాందాస్, తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్, లోకేశ్వరం, ధర్మోర గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరపరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.

క్లుప్తంగా

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



టీజీబీ మేనేజర్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

లోకేశ్వరం: ఐకేపీలో వీవోఏలుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు రమాణారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని టీజీబీ మేనేజర్ అశోక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందజేసి వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలన్నారు. సెర్ప్ ఉద్యోగులను గుర్తించి ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. రూ.10 లక్షల సాధారణ బీమా, హెల్త్‌కార్డులు అందించాలన్నారు. అర్హులైన వీవోఏలకు సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు సంగీత, గంగాధర్, గంగన్న, సునీత, లలిత పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి



కార్యకర్తలతో సమావేశమైన నాయకులు

కుంటాల: మండల కేంద్రంలో ఈనెల 18న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి కోరారు. మండలంలోని లింబా (బి) గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ప్రదీప్‌కుమార్, సర్పంచ్ పెద్దికాపు మల్లేశ్, ఆత్మ చైర్మన్ సవ్విఅశోక్ రెడ్డి, మాజీ సర్పంచులు కొత్తపల్లి బుచ్చన్న, రమణగౌడ్, బీఆర్‌ఎస్వీ మండల కన్వీనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల తనిఖీ



కేజీబీవీలో భోజనం పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌గౌడ్

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం, భూత్కూర్, దస్తురాబాద్ గ్రామ పంచాయతీలను ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌గౌడ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతివారం ఐదు గ్రామ పంచాయతీలను తనిఖీ చేసి పల్లె ప్రగతిలో భాగంగా డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, ప్రకృతివనం, జీపీల పనితీరు, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు తదితర వాటిని తనిఖీ చేసి నివేదికలు అందిస్తామన్నారు. కార్యదర్శులు ఇందుమతి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఓటర్ల నమోదు పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.ఏ కలీం

కుంటాల: ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ ఎం.ఏ కలీం పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఓటర్ జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి ధ్రువీకరించాలన్నారు. డీటీ నరేశ్‌గౌడ్, ఆర్‌ఐ విజయ్, సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మోడల్' ప్రవేశపరీక్ష

కుంటాల: స్థానిక మోడల్ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశం కోసం 7,8,9,10 పదో తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు 440 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా, వీరికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 7 నుంచి పదో తరగతి వరకు 343 మంది దరఖాస్తులు చేసుకోగా వీరికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని చీఫ్ సూపరింటెండెంట్ కిషన్‌రావు, డీవో రమణరావు పేర్కొన్నారు.